క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న సీఐ సంఘమేశ్వరరావు

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను నాయుడుపేట సర్కిల్ రూరల్ సీఐ సంఘమేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి వైద్య సేవలు


నల్లబ్యాడ్జీలు ధరించి వైద్య సేవలను అందిస్తున్న సైదాపురం వైద్యాధికారి శ్రావణి

సైదాపురం: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటా కుదిస్తూ తీసుకొచ్చిన జీవో 85కు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. ఈక్రమంలో భాగంగా సైదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి వైద్య సేవలను అందించారు. 16వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వైద్యులు పేర్కొన్నారు. జీవో 85ను తీసుకుని రావడంతో అన్యాయమన్నారు.

ఎన్‌సీసీ నేవీ సైనిక్ శిబిరంలో ఎన్‌బీకేఆర్ విద్యార్థి


ఎన్‌సీసీ నేవీ సైనిక శిబిరంలో పాల్గొన్న ఎన్‌బీకేఆర్ విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న బి.మహీధర్ రెడ్డి ఎన్‌సీసీ నేవీ వింగ్‌లో ప్రతిభ కనబరిచారు. ముంబైలో జరిగిన ఆలిండియా నౌ సైనిక్ శిబిరానికి ఎంపికై హెల్త్ అండ్ హైజీన్ అనే పోటీలో కాంస్య పతకం సాధించినట్లు కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి విద్యార్థి మహీధర్‌రెడ్డిని అభినందించారు.

సముద్ర తీరాన పారిశుధ్య పనులు

వాకాడు: తూపిలిపాళెం బీచ్‌లో గత మూడు రోజులుగా కొనసాగుతున్న గణేష్ విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో తీరంలో పారిశుధ్య పనులు నిర్వహించాలని గూడూరు డీఎల్పీఓ వెంకటరమణ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం తూపిలిపాళెం సముద్ర తీరంలో పర్యటించారు. ప్రస్తుతం విగ్రహాల నిమజ్జనం కారణంగా తీరంలో కలుస్తున్న చెత్తా చెదారంతో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈయన వెంట ఎంపీడీఓ మనోహర్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

సమ్మెలో ఉన్నా వైద్య సేవలు

బాలాయపల్లి(సైదాపురం): సమ్మెలో ఉంటూ మానవతా దృక్పథంతో వైద్యసేవలు అందిస్తామని బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు ప్రమీల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యుల కోటాను 30 నుండి 15 శాతానికి తగ్గిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 85ను వెంటనే రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ విధులు కొనసాగించనున్నట్లు తెలియజేశారు. వైద్యులు లిఖిత, లియోనా పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

వెంకటగిరి రూరల్: యాతలూరు ఎస్టీకాలనీలో టీవీఎస్ మోటారుసైకిల్ అనుబంధంగా ఉన్న శ్రీనివాసన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా మంగళవారం మహిళలు, చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి జీకేపల్లి పీహెచ్‌సీ వైద్యులు రెడ్డిప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహిత, శ్రీనివాసన్ సేవా సంస్థ ఇన్‌చార్జి జైసింగ్ బహుమతులు ప్రదానం చేశారు.

రెండు సిలికా టిప్పర్లు సీజ్

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై తిరుపతి విజిలెన్స్ అధికారులు మంగళవారం నిర్వహించిన దాడుల్లో అధిక లోడ్‌తో వెళ్తున్న రెండు సిలికా టిప్పర్లు పట్టుబడ్డాయి. వీటిని సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నెల్లూరు నుంచి చెన్నైకు అధిక లోడ్‌తో వెళ్లే రెండు సిలికా టిప్పర్లను గుర్తించి సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

చిల్లకూరు: వరగలి సమీపంలో ఓ ప్రైవేటు స్కూల్ బస్సు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వరగలి గ్రామానికి చెందిన మనోజ్ అనే యువకుడితో పాటు మరో ఇద్దరు యువకులు మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళుతున్నారు. అదే సమయంలో ఏరూరులోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు పిల్లలని వదిలేందుకు వరగలికి వస్తుండగా మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో మోటార్‌సైకిల్‌పై ఉన్న మనోజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన మనోజ్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

నిమజ్జనానికి తరలిన గణనాథుడు

సూళ్లూరుపేట: వినాయకచవితి పండుగను పురస్కరించుకుని సూళ్లూరుపేట పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమలకు మూడు రోజుల పాటు ఘనంగా పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం ఎదురుగా ఉన్న కాళంగి నదిలో నిమజ్జనోత్సవాలను కోలాహలంగా నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎక్కువగా విగ్రహాలు ఏర్పాటు చేయడంతో మున్సిపాలిటీవారు, పోలీస్ శాఖవారు సంయుక్తంగా హైదరాబాద్ తరహాలో కాళంగి నదిలోకి రూట్ ఏర్పాటు చేసి క్రేన్ సహాయంతో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. నది వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి నిమజ్జనం నిర్వహించారు. అయితే చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న శ్రీనగర్‌కాలనీలో ఈ ఏడాది మొట్టమొదటగా వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులపాటు కాలనీకి చెందిన మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామం, విష్ణు పారాయణం, వినాయకుడి నామస్తుతి, భగవద్గీత పారాయణం తదితర ఆధ్యాత్మికపరమైన కార్యక్రమాలను నిర్వహించారు. అదే విధంగా మహిళలకు రంగవల్లుల పోటీలు, చిన్నారులకు సైక్లింగ్, పరుగు పందాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాటం, కాలనీ చిన్నారులతో తీన్‌మార్, డీజే డ్యాన్స్ కార్యక్రమాలను నిర్వహించారు. రెండో రోజు ఆదివారం పూజా కార్యక్రమాలనంతరం చిన్నారులకు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. సాయంత్రం కాలనీ చిన్నారులతో నృత్య ప్రదర్శనలు, వారికి బహుమతి ప్రదానం, ఫ్యాషన్ షో, శ్రీచెంగాళమ్మ డ్యాన్స్ అకాడమీ వారితో భరత నాట్యం, డాక్టర్ అయినాపురపు రామలింగేశ్వరావు మాట్లాడే బొమ్మ, మిమిక్రీ, మ్యాజిక్ షో నిర్వహించారు. ఆఖరు రోజు సోమవారం సాయంత్రం ఘనంగా ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి చేతిలోని లడ్డూకు వేలం పాట నిర్వహించగా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ పర్వతరెడ్డి కవిత ప్రభాకర్‌రెడ్డి దంపతులు రూ.51 వేలకు పాడుకున్నారు. అలా పాడిన లడ్డూ ప్రసాదాన్ని అక్కడే అందరికీ పంచిపెట్టారు.


సూళ్లూరుపేట శ్రీచెంగాళమ్మ ఆలయం సమీపంలోని శ్రీనగర్‌కాలనీలో వినాయకుడి ప్రతిమకు పూజలు

మూడు రోజులపాటు తీర్థ ప్రసాదాలను విరివిగా పంచిపెట్టారు. నిమజ్జనోత్సవంలో భాగంగా తీన్‌మార్ బ్యాండ్, కోలాటాలు, బాణాసంచా వేడుకలతో శ్రీనగర్‌కాలనీలో స్వామివారిని ఊరేగించి గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం ఊరేగింపు గానే కాళంగి నదికి తీసుకెళ్లి నిమజ్జనం చేయడంతో ఉత్సవాలు ముగిశాయి. అలాగే పట్టణంతోపాటు పల్లెటూళ్ల నుంచి సోమవారం అర్ధరాత్రి దాకా సుమారు 40 విగ్రహాలకు పైగా నిమజ్జనం నిర్వహించారు. మళ్లీ ఐదోరోజు అయిన గురువారం, ఏడో రోజైన శనివారం, తొమ్మిదో రోజైన సోమవారం కూడా నిమజ్జనాలు ఉన్నాయని పోలీస్ వారు తెలియజేశారు.

ఓజిలిలో..

ఓజిలి: వినాయక చవితి వేడుకల్లో భాగంగా నాలుగో రోజు పలు గ్రామాల్లో గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలోని సగుటూరు, చిలమానుచేను, ఆర్మేనిపాడు, వీర్లగునపాడు, కురుగొండ తదితర గ్రామాల్లో వినాయకుని విగ్రహాలకు పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు. చిలమానుచేను ఎస్సీ కాలనీలో యువకులు వేడుకగా ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. యువత కేరింతల నడుమ రంగులు చల్లుకుంటూ సముద్రస్నానానికి బయల్దేరివెళ్లారు. గణనాథునికి తుది వీడ్కోలు పలికారు.

నాయుడుపేట టౌన్: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని పట్టణంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మంగళవారం నాడు కూడా నిమజ్జనానికి తరలించుకుపోయారు. పట్టణంలోని ఆకుతోట వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి అక్కడి స్థానికులు రంగులు చల్లుకుంటూ వేడుకగా గణపయ్యను నిమజ్జనం చేసేందుకు ట్రాక్టర్‌లో తూపిలిపాళెం సముద్రం వద్దకు తరలించారు. ఈ వేడుకల్లో యువత, మహిళలు, పిల్లలు సైతం పాల్గొని తీన్‌మార్ బ్యాండులతో కోలాహలంతో ఊరేగింపు జరిపారు. ముస్లిం వీధిలో విగ్రహం వద్ద వైఎస్‌ఆర్‌సీపీ యువత నాయకుడు సన్నారెడ్డి కిషోర్‌రెడ్డి దాతృత్వంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్ పాపాడి చంద్రారెడ్డి ప్రారంభించారు. రాత్రి ముస్లిం వీధిలోని విగ్రహం వద్ద హోమపూజలు నిర్వహించారు. పలు వినాయకుని విగ్రహాల వద్ద మధ్యాహ్నం అన్నదానం, రాత్రి పిల్లలతో భరత నాట్య ప్రదర్శన నిర్వహించారు.

వాకాడులో...

వాకాడు: వినాయక చవితి పర్వదినం సందర్భంగా గత నాలుగు రోజులుగా ఆయా గ్రామాల్లో విశేష పూజలందుకున్న గణనాథులను మంగళవారం తూపిలిపాళెం సముద్రంలో భక్తులు నిమజ్జనం చేశారు. 8, 9, 10 తేదీల్లో వరుసగా గణనాథుల విగ్రహాల నిమజ్జన పర్వం తూపిలిపాళెం బీచ్‌లో కొనసాగుతోంది. ఇప్పటి వరకు తూపిలిపాళెం, ఓడపాళెం, పూడికుప్పం, నవాబుపేట, శ్రీనివాసపురం, దుగ్గరాజపట్నం గ్రామాల సముద్ర తీరాన దాదాపు 1024 గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. లోకల్, కోస్టల్ మెరైన్ పోలీసులతోపాటు, స్థానిక మత్స్యకారులు భక్తులకు భద్రత కల్పించడంలో అందుబాటులో ఉన్నారు.


ఓజిలి:నిమజ్జనానికి తరలిన వినాయకుడు


చిన్నారుల ఫ్యాషన్ షో


కాళంగినదిలో వినాయకుడి ప్రతిమ నిమజ్జనం

ముందస్తు హెచ్చరికలు పట్టించుకోని ప్రభుత్వం

- బాధితులను ఆదుకోవడంలో విఫలం


మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

చిల్లకూరు: భారీ వరదలు విజయవాడ ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తాయని అధికారులు ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వంలోని పెద్దలు పెడచెవిన పెట్టారని వైఎస్‌ఆర్ సీపీ గూడూరు ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బాధితులను ఆదుకోవడంలో విఫలమైన ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తుండడం విచారకరమని విమర్శించారు. ఆయన మాట్లాడుతూ వరదల సమయంలో బుడమేరు పొంగి ప్రవహిస్తుందని ఇంజినీరింగ్ అధికారులు పరిస్థితిని సమీక్షించి ప్రభుత్వాని ముందుగా హెచ్చరికలు చేశారన్నారు. అయితే స్వలాభం చూసుకునేలా సీఎం చంద్రబాబు ఇంటి మీదకు నీరు రాకుండా జాగ్రత్తలు తీసుకుని బుడమేరు నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా వదిలారన్నారు. దీంతో విజయవాడలోని పలు ప్రాంతాలు నీట మునిగాయని వివరించారు. ఇలా నీటిని హఠాత్తుగా వదలడం ద్వారా పెద్ద ఎత్తున నీరు గ్రామాలు, కాలనీలపై పడి లోతట్టు ప్రాంతాల్లోని ప్రతి ఇల్లు నీటి మునిగాని తెలిపారు. పెద్ద ఎత్తున నష్టాలపాలైన బాధితులను ఓదార్చాల్సింది పోయి ట్రాక్టర్‌లు, బోట్లు ఎక్కి షికార్లు చేస్తూ ఫొటోలు తీసుకుంటున్నారని అన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితిలో వలంటీర్ వ్యవస్థ ఉంటే ఎలా పని చేసి ప్రజలను ఆదుకునే వారు అనే విషయాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. గతంలో వరదల వచ్చే ముందే అధికారులతో పాటుగా వలంటీర్లు ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా హెచ్చరిస్తూ ప్రజలకు నష్టాలను తగ్గించే ప్రయత్నం చేశారన్నారు. విజయవాడలోని పలు ప్రాంతాల్లో ఆరు రోజులు గడుస్తున్నా నడుము లోతు నీటిలో మురుగు కంపు కొట్టుకుంటూ ప్రజలు ఉన్నారని తెలిపారు. వారి దగ్గరకు వెళ్లి ఆహారం ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం యంత్రాంగం ఉందని విమర్శించారు. వరదల సమయంలో 50 మందికి పైగా చనిపోయారని తెలిపారు. ప్రజలను రక్షించలేని స్థితిలో ఉన్న ప్రభు త్వం ఎందుకని ప్రశ్నించారు. వరదలు వచ్చినప్పటి నుంచి ప్రతి రోజూ ప్రెస్ మీట్‌లు పెట్టి ఊక దంపుడు ఉపన్యాసాలతో అండగా ఉన్నానని చెప్పడం తప్ప ఇంకేమీ చేయలేకపోయారని దుయ్య బట్టా రు. ఇకనైనా నీటి పారుదల శాఖ, వాతావరణశాఖ అధికారుల ముందస్తు హెచ్చరికలను పెడ చెవిన పెట్టకుండా ప్రజలకు ఆ సమాచారం అందించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి, నష్ట నివారణ చర్యలు చేపట్టేలా చూసుకోవాలని సూచించారు.

హద్దు రాళ్లు తొలగింపు

చిల్లకూరు: ప్రభుత్వ భూములకు హద్దులు అనే శీర్షికన సాక్షి దినపత్రికలో మంగళవారం కథనం వెలువడడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలోని కడివేడు రెవెన్యూ పరిధిలోని చుట్టుగుంట ప్రాంతంలోని సర్వే నెంబర్ 958లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమికి కొంత మంది హద్దు రాళ్లను వేసుకుని ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. ఈ విషయంపై సాక్షి దినపత్రికలో కథనం రావడంతో వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి, వేసిన హద్దు రాళ్లను తొలగించారు.



హద్దు రాళ్లను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

జాతరకు పటిష్ట భద్రత

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలో ఈ నెల 25, 26వ తేదీల్లో శ్రీపోలేరమ్మతల్లి జాతరను పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించనున్నట్లు అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి పేర్కొన్నారు. అమ్మవారి జాతర నిర్వహించే ప్రధాన ఘట్టాలు కుమ్మరివీధి, జీనుగులవారివీధి, రాజావీధి, నిష్క్రమణ ప్రదేశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. గూడూరు డీఎస్పీ రమణకుమార్, సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐలు విక్రమ్, గోపి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సైదాపురం: ప్రభుత్వ పాఠశాలలో నిర్వహణ కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఆర్ చక్రవర్తి పేర్కొన్నారు. మండలంలోని తురిమెర్ల, ఊటుకూరు, గిద్దలూరు, సైదాపుం, చాగణం, మర్లపూడి, కాంప్లెక్స్ పరిధిలోని బీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 7 నెలల నుండి ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు వేతనాలు చెల్లించలేదన్నారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణి జిల్లా ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్, కోశాధికారి రిజాయ్, మండలప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ఖాజా, రహంతుల్లా మహిపతిరాజ్, కిషోర్ పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న బీటీఏ నేతలు

గిరిజన కాలనీలో అధికారుల పర్యటన

దొరవారిసత్రం: శ్రీధనమల్లి పంచాయతీ పరిధిలోని కుమ్మరికండ్రిగ ఎస్టీ కాలనీలో మంగళవారం అధికారులు పర్యటించారు. గ్రామ సమస్యలు, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగు రోజుల కిందట కాలనీవాసులు సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో డీవీ సత్రం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులను కలిసి సమస్యలు విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన స్థానిక ఎంపీడీఓ సింగయ్య, ఏఓ రఘురామయ్య, పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌మస్తాన్, వైఎస్ఆర్ సీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డి ఎస్టీ కాలనీలో పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో ముఖ్యంగా శ్రీధనమల్లి గ్రామం నుంచి రోడ్డు మార్గం ఏర్పాటు, తాగేందుకు నీళ్ల సక్రమంగా లేనందున పడుతున్న ఇబ్బందులు వెల్లడించారు. మినీ అంగన్ వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను కాలనీవాసులు కోరారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని ఎంపీడీఓ తెలియజేశారు. వీరి వెంట సీపీఎం నాయకులు చంద్రశేఖర్, మునెయ్య, ప్రభాకర్ ఉన్నారు.


కుమ్మరికండ్రిగ ఎస్టీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

వేనాడు గంధ మహోత్సవం ప్రారంభం

తడ: వేనాడు గ్రామంలో వెలసిన షేక్ దావూద్ షావలీ అల్లాహ్ 29వ గంధ మహోత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. దర్గా వద్ద అలంకరించిన రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ, భక్తులను ఆకట్టుకునేందుకు ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు, పిల్లలకు, మహిళలకు కావాల్సిన వస్తు సామగ్రి విక్రయించే దుకాణాలతో పండుగ వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దర్గా వద్దకు చేరుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఊరేగింపుగా దర్గా వద్దకు వచ్చే గంధం తిలకించేందుకు అనువైన ప్రాంతంలో పడకలు ఏర్పాటు చేసుకోవడంతో దర్గా పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. నాయుడుపేట డీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ బృందాలు తమ విధుల్లో నిమగ్నమయ్యారు. 'గంధోత్సవంలో ముఖ్యమైన గంధాన్ని గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకు వచ్చారు. బాబా దర్గాకు సమర్పించేందుకు ఏర్పాటు చేసిన రథాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. గంధానికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు దర్గా వద్ద కవ్వాలీ పోటీలు ఏర్పాటు చేశారు.

అనూహ్యంగా భారీ వర్షం రావడంతో భక్తులు తలదాచుకునేందుకు దర్గా వద్ద ఉన్న ఒకే షెడ్డులోకి చేరడంతో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి.


దర్గా వద్ద భక్తుల సందడి

రజకులు చైతన్యవంతులు కావాలి

కోట: రజకులు చైతన్యవంతులు కావాలని ఆ సంఘం నాయకుడు కనుపూరు జగదీష్ అన్నారు. కోట మండలం వెంకన్నపాళెంలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనుపూరు జగదీష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రజకుల కుటుంబాలు ఉన్నప్పటికీ వారు ఇంకా వెనుకబాటుతనానికి గురవుతున్నారని తెలియజేశారు. ఆర్థికంగా, సామాజిక, రాజకీయ రంగాల్లో రజకులకు తగిన ప్రాధాన్యం దక్కాలని ఆయన కోరారు.. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట్రావు, వెంకటేశ్వర్లు, పిచ్చయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బిడ్డ ఆరోగ్యకరంగా ఉండాలి

సైదాపురం: పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యకరంగా ఉండేలా తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాపూరు సీడీపీఓ సునంద పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా చాగణం సెక్టార్ పరిధిలోని లింగన్నపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన మహిళలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భవతులకు ఉచితంగా సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా బిడ్డ వయసును బట్టి బరువు, ఎత్తు ఉండాలని ఈ మేరకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ ధనమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జీవో నెంబర్ 85ను రద్దు చేయాలి

వెంకటగిరి రూరల్: ప్రభుత్వ వైద్యులకు నష్టం కలిగే విధంగా రూపొందించిన జీవో నెంబర్ 85ను వెంటనే రద్దు చేయాలని బంగారుపేట పీహెచ్‌సీ వైద్యుడు శివకుమార్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సంఘం పిలుపు మేరకు పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్-19, కరోనా వంటి విపత్కర పరిస్థితిలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి వైద్యసేవలు అందించామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పీజీ అవకాశాలను తగ్గించి జీవో 85ను విడుదల చేయడం సరికాదన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు శాంతియుతంగా సమ్మె కొనసాగించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని తెలియజేశారు.

శివాలయంలో అన్నదానం

రాపూరు: వినాయక చవితి సందర్భంగా రాపూరు శివాలయంలో ఏర్పాటు చేసిన తత్కాలిక గణనాథునికి మంగళవారం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి ఊంజల్ సేవ, విద్యాగణపతి పూజ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

కడదాకా వీడని స్నేహ బంధం

నాయుడుపేట టౌన్: ప్రాణ స్నేహితులుగా ఉన్న నాయుడుపేట పట్టణానికి చెందిన షేక్ ఫయాజ్(22), మునిరాజా(22)లు వినాయకుని నిమజ్జనానికి వెళ్లి తూపిలిపాళెం సముద్రంలో అలల్లో చిక్కుకుని సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. మరణంలో కూడా వీరి స్నేహ బంధం వీడలేదని అంతా కన్నీటి పర్యంతమయ్యారు. ఇద్దరి మృత దేహాలు మంగళవారం సాయంత్రం నాయుడుపేట పట్టణంలోని వారి నివాసాల వద్దకు చేరుకున్నాయి. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి. సాయంత్రం ఫయాజ్ ఇంటి వద్ద నుంచి అనేక మంది కుటుంబ సభ్యులు, బంధువులు అశ్రునయనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. అంత్యక్రియల్లో స్నేహితులు అధిక సంఖ్యలో హాజరై చివరి వీడ్కోలు పలికి ఘనంగా నివాళులర్పించారు. మునిరాజా అంత్యక్రియలను బుధవారం ఉదయం నిర్వహించనున్నారు.


ఫయాజ్ ఇంటి వద్ద విషాదకర వాతావరణం



ఫయాజ్, మునిరాజా(ఫైల్)

అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

సూళ్లూరుపేట రూరల్: గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిశీలించి, వచ్చే సర్వసభ్య సమావేశంలోపు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రమీలా రాణి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొని పలు సమస్యలపై చర్చించారు. అందరూ సమష్టిగా కలిసి సమస్యలను పరిష్కారం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

నేడు పోలేరమ్మ జాతర మొదటి చాటింపు

- రాజాల అనుమతి తీసుకోనున్న నిర్వాహకులు



వెంకటగిరి రూరల్/వెంకటగిరి(సైదాపురం): భక్తుల కొంగు బంగారం, వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ తల్లి జాతర బుధవారం తొలి చాటింపుతో ప్రారంభం కాబోతుంది. వినాయక చవితి అనంతరం వచ్చే మొదటి బుధవారం మొదటి చాటింపు వేసి జాతర ఏర్పాట్లు ప్రారంభించడం ఆనవాయితీ. ఈ మేరకు రాజా ప్యాలెస్‌లో బుధవారం రాజాల అనుమతులు తీసుకోనున్నారు. ఈ నెల 18వ తేదీన రెండో చాటింపు, 22వ తేదీన ఘటోత్సవం, 25, 26వ తేదీల్లో అమ్మవారి ఉత్సవం, నిలుపు, నగరోత్సవం, నిష్క్రమణతో జాతర ముగియనుంది. ఇప్పటికే అమ్మవారి ఆలయం, జాతర నిర్వహించే ప్రధానమైన ప్రదేశాలు కుమ్మరిళ్లు, జీనిగులవారి వీధిలోని అమ్మవారి మెట్టినిల్లు, పోలేరమ్మతల్లి ఆలయం వద్ద ఉన్న మండపాలను పెయింటింగ్‌తో అత్యాధునికంగా అలంకరిస్తున్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

గూడూరు రూరల్: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గూడూరు సాయి సత్సంగ నిలయం నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. వరద బాధితుల సహాయార్థం మంగళవారం సాయిసత్సంగ నిలయం, చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. విజయవాడకు వెళ్లి అవసరమైన వారికి ఇక్కడ సేకరించిన వస్తువులు, ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి చెంచురామయ్య, చంద్రశేఖర్, శ్రీధర్, కిషోర్‌రెడ్డి, జయ, వంశీ తదితరులు పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న సునీల్‌కుమార్

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

గూడూరు రూరల్: చర్చి వీధిలోని గాంధీ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం 1986-87లో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అలనాటి విద్యార్థులందరూ కలుసుకుని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యాసామగ్రి, భోజన ప్లేట్లు, అవసరమైన కుర్చీలను అందజేశారు. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయిని మేరి శ్యామ సుందరి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు.


పూర్వ విద్యార్థుల సమ్మేళనం